


(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

***24-10-15 8 వరోజు***

ఆ రాత్రి ఓడ బయలుదేరలేదు. హోటల్ కన్నా ఓడ చవక కాబట్టి కేబిన్స్‌లో నిద్ర. ఉదయం రెండున్నరకి వేకప్ కాల్. లేచి తయారై మూడున్నరకి రెసెప్షన్‌లో బ్రేక్‌ఫాస్ట్ తీసుకుని ఓడ దిగి ఒడ్డుకి వచ్చి కోచ్ ఎక్కాం. ఈ రోజు మా ఐటెనరరీ అబూ సింబల్. బస్ మూడు నలభైకి బయలుదేరింది. ఈజిప్ట్‌లోని రోడ్లు అధ్వాన్నంగా ఉంటాయి. కానీ పర్యాటకులు అధికంగా వచ్చే అబూ ఇస్ంబల్, రెడ్ సీ రిసార్ట్స్‌లాంటి పర్యాటక ప్రాంతాల్లో మాత్రం రోడ్లు ఫర్వాలేదు. బస్‌లు, వేన్‌లు కార్లు కలిసి కాన్వాయ్ గా అబూ సింబల్‌కి బయల్దేరాయి. బహుశా ఎడారి దొంగల భయం ఉండచ్చు అనుకున్నాను. దారిలో బ్రేక్‌ఫాస్ట్ తిన్నాం. ఓ ఏపిల్, ఓ అరటిపండు, క్రొసాంట్, మేంగో జ్యూస్ టెట్రాపేక్, స్మోక్డ్ ఛీజ్ సేండ్‌విచ్, మాములు సేండ్‌విచ్, జామ్ పాకెట్ ఉన్నాయి. ఛీజ్ సేండ్‌విచ్ నచ్చక వదిలేసాను. బస్‌లో దసాని బ్రాండ్ ఒకటిన్నర లీటర్ బాటిల్ ప్రతీ ప్రయాణికుడికి ఒకటి చొప్పున ఇవ్వాలి. కానీ మొహమ్మద్ బస్ ఎక్కాక వాటిని ఇవ్వలేదు. అడిగిన వారికి మాత్రమే ఇచ్చాడు.

బస్‌లో నాకు కునుకు పట్టింది. తోటివాళ్ళ మాటలకి మెలుకువ వచ్చి చూస్తే, సూర్యోదయమౌతోంది. ఎదురుగా నల్లటి తారు రోడ్ అటు, ఇటు సహార ఎడారి. పక్షులు కాని, జంతువులు కానీ కనబడలేదు. అదృష్టవశాత్తు బస్‌లోని ఏసి బాగా పనిచేస్తోంది. దారిలో కుడివైపు పెద్ద తోట కనిపించింది. ఎడారిలో!. ఓ అరబ్ పెట్టుబడి పెట్టి దాన్ని అభివృద్ధి చేశాడని డ్రైవర్నడిగితే చెప్పాడు. రెండు గ్రామాలు కనిపించాయి. అవి ఎల్ జోర్, ఎల్ మొస్తకావల్. మరికొంత దూరం వెళ్ళాక ఎడమవైపు తోష్కా అనే ఓ గ్రామం కనిపించింది. అది కొత్తగా వెలిసింది. అస్వాన్ హై డేమ్ నిర్మాణం తర్వాత మునిగిపోయిన అదే పేరు గల గ్రామం పేరున లేక్ నాజర్‌కి అరవై కిలోమీటర్ల దూరంలో తోష్కా నే ఈ ఊరుని నిర్మించారు. ఈ ప్రాంతంలో ఓ పంటకాలువ కూడా ఉంది. జనవరి 2018కి దీని జనాభా రెండున్నర లక్షలు. ప్రజలు ఇక్కడికి వచ్చి స్థిరపడటానికి వీలుగా ప్రభుత్వం ఉచితంగా భూమి, ఇల్లు ఇచ్చింది. మూడేళ్ళ దాకా వీరికి టేక్స్ కూడా లేదు. ఇటుకలతో కట్టిన ఇళ్ళపైన డోమ్స్‌కి రంధ్రాలున్నాయి. దానివల్ల ఇంట్లో వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంటుందని డ్రైవర్ని అడిగితే చెప్పాడు.

ఉదయం ఏడున్నరకి యూనిఫాంలోని స్కూలు పిల్లలు రోడ్ పక్కన నిలబడి మాకు చేతులూపారు. ఈజిప్షియన్ ఉత్పత్తులతో సూడాన్ వెళ్ళే లారీలు పాతికదాకా కలిసి ప్రయాణిస్తూ కనిపించాయి. ఉదయం 8కి మా బస్ అబూ సింబల్‌కి సమీపంలో ఆగింది. నైల్ నది మీద ఆస్వాన్ డామ్ నిర్మాణంలో నీట మునిగిన ప్రాంతం నించి అబూ సింబల్ ఆలయాలు రెంటినీ ఈజిప్ట్ ప్రభుత్వం, యునెస్కో చెరి సగం ఖర్చుతో ఇక్కడికి తరలించాయి. వీటిని 1960లో ఇంజనీర్లు వెలికితీసి 1968 నాటికి 60 మీటర్ల ఎత్తుగల మానవ నిర్మిత సేండ్‌స్టోన్ గుట్ట మీద పునర్నించారు. ఆలయంలోని ఒకో ముక్కని పెద్ద పెద్ద క్రేన్స్‌తో ఎత్తి తరలించి మళ్ళీ యధాతథంగా అమర్చారు. ఇది

యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్. అబూ సింబల్ నుబియాలో ఓ ముఖ్యమైన గ్రామం. ఇది అస్వాన్‌కి నైరుతి దిశలో 281 కిలోమీటర్ల దూరంలో, సూడాన్ సరిహద్దుకి 45 కిలోమీటర్ల దూరంలో ఉంది. అస్వాన్ నించి అబూ సింబల్‌కి ఓ విమానసర్వీస్ ఉంది. 30 నిమిషాల ప్రయాణం.

"మీరంతా సరిగ్గా పది గంటలకి మళ్ళీ తిరిగి రావాలి. ఐదు నిమిషాలు మించి మీకోసం ఎదురు చూడను. మిస్సైనవాళ్ళు ఇరవై నాలుగు గంటల తర్వాత వచ్చే బస్‌లో తిరిగిరావల్సి ఉంటుంది. ఫ్లాష్ కెమేరాలని బస్‌లోనే వదలండి. ఆలయాల్లోని పెయింటింగ్స్‌కి ఫ్లాషెస్ హాని చేస్తాయి." మహమ్మద్ హెచ్చరించాడు.

బస్ దిగి అబూ సింబల్ ఆలయాల వైపు అతని వెంట నడిచాం. దారిలో రేకుల షెడ్లలో ఈజిప్షియన్ కాటన్ దుస్తులు, టోపీలు, గొడుగులు, రామ్‌సేస్ - 2, నెఫర్టరీ బొమ్మలున్న విసనకర్రలు, హస్తకళా వస్తువులు మొదలైనవి షాపుల బయట వేలాడుతూ కనిపించాయి. చాలా షాపులున్నాయి. వాటిని కొనమని వాళ్ళు సందర్శకులని పిలుస్తున్నారు. ఉదయం ఎనిమిదికే ఎండ వేడి భరించలేనంతగా ఉంది. 2015 జులై 14న అక్కడ అరవై డిగ్రీల సెల్సియస్ ఎండ ఉందిట. (హైదరాబాదులో మేగ్జిమం నలభై ఐదు డిగ్రీల సెల్సియస్) ఇక్కడ పగటి పొద్దు ఎక్కువ. రాత్రి తక్కువ. రంజాన్ సమయంలో సుర్యుడు పదిహేడు గంటలు కనిపిస్తాడు. చాలామంది యురోపియన్స్ టోపీలని ధరించారు. కొందరు నెత్తిమీద రుమాళ్ళతో కనిపించారు. మేము ఎస్.ఓ.టి.సి ఇచ్చిన టోపీలని పెట్టుకున్నాం.

కొద్ది దూరం వెళ్ళాక 'వే టు అబూ సింబల్' అనే బోర్డ్ ఇంగ్లీష్‌లో, అరబిక్‌లో రాసి కనిపించింది. మొత్తం రెండు కిలోమీటర్లదాకా నడిచి ఉంటాం. రెండు ఆలయాలకి కలిపి టిక్కెట్ 100 ఈజిప్షియన్ పౌండ్లు.

"క్రీస్తుపూర్వం 1279 - 1313 మధ్య ఈజిప్ట్‌ని పాలించిన చక్రవర్తి ఫారో రామ్ సేస్ - ఇక్కడ రెండు ఆలయాలని నిర్మించాడు. దేవతల మధ్య తనకి స్థానం సంపాదించుకోడానికి, తన ఆర్థికశక్తితో శతృవులని భయపెట్టడానికి వీటిని నిర్మించాడు. హిటైటిస్ మీద ఖాద్వేష్ యుద్ధంలో గెలిచాక తన విజయానికి గుర్తుగా, శతృవులకి హెచ్చరికగా కూడా వీటిని నిర్మించాడు. క్రీస్తుపూర్వం మొత్తం పదకొండుమంది రామ్ సేస్‌లు ఈజిప్ట్‌ని పాలించారు. రా=దేవత మెస్=జన్మించిన. రామ్‌సేస్ అంటే దేవతకి జన్మించినవాడని అర్థం. రామ్‌సేస్ -2 తనో దేవుడు అనుకునేవాడు. తొంభై ఏళ్ళు జీవించాడు. రామ్‌సేస్-2 మరణించాక ఇతని శవాన్ని వేలీ ఆఫ్ కింగ్స్‌లో ఖననం చేసారు. 1881లో దీన్ని కనుగొన్నాక కైరోలోని ఈజిప్షియన్ మ్యూజియానికి తరలించారు. ఈయనకి 98 మంది కొడుకులు, 102మంది కూతుళ్ళు. 36మంది భార్యలు, అనేకమంది ప్రియురాళ్ళు ఉండేవారు. ఇతను ఎక్కువగా ప్రయాణాలు చేస్తూండేవాడు. ప్రతీచోట ఇతనికి భార్యలు, ప్రియురాళ్ళు ఉండేవారు. ఈయన తన కూతుళ్ళని కూడా పెళ్ళి చేసుకున్నాడు. ఐతే వారితో శారీరక సంబంధం లేదు. ఆయన మరణానంతరం వాళ్ళంతా మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. ఇతను తన పెద్ద భార్య నెఫర్టరీ మీది ప్రేమతో అబూ సింబల్‌లోని రెండో ఆలయాన్ని కట్టించాడు. నెఫర్టరీ అంటే అందమైన సహచరి అని అర్థం. క్లియోపాత్రా, హేట్‌షెప్సుట్‌లలా ఈజిప్ట్‌లో పేరుపొందిన రాణి. ఈమె బాగా విద్యావంతురాలు. హైరోగ్లిఫిక్స్‌ని రాయడం, చదవడం వచ్చు. ఆ రోజుల్లో అది అరుదైన నైపుణ్యం. ఆమె తన రాజరిక అధికారంతో ఇతర రాజులతో ఉత్తరప్రత్యుత్తరాలని తనే స్వయంగా చేసేది. బాగా అలంకరించబడ్డ ఆమె సమాధి వేలీ ఆఫ్ ది క్వీన్స్‌లో ఉంది. దాని పేరు క్యువి66. అది అతి పెద్దది, అతి విశిష్టమైనది. చూడటానికి ఇంపుగా ఉంటుంది." గైడ్ చెప్పాడు.

"అంతమంది భార్యలు, ప్రియురాళ్ళు, అంత ఆయుర్దాయం, పైగా రాజు. ఎంత అదృష్టవంతుడు" మా గ్రూప్‌లోని ఒక ముసలాయన గొణిగాడు.

ఎదురుగా నైల్ నదికి 656 అడుగుల దూరంలో, 214 అడుగుల ఎత్తుగల మానవనిర్మిత సేండ్ స్టోన్ గుట్టమీద నిర్మించిన అబూ సింబల్ ఆలయాలు రెండూ కనిపించాయి. పైన కాంక్రీట్ డోమ్.

"అందమైన తాజ్‌మహల్ కట్టించి ఆరు వందల ఏళ్ళే ఐంది. దానికి పూర్వం, 3,300 ఏళ్ళ క్రితం నిర్మించబడిన ఇది అందమైన కట్టడం. ఐనప్పటికీ నిన్ననే రంగులు వేసినట్లుగా కనిపిస్తుంది. ఇది అస్వాన్ ముహాఫజా (గవర్నరేట్)లో ఉంది.



నెఫటరీ టెంపుల్

రెండు ఆలయాలు రెండు గుట్టల లోపల ఉన్నాయి. ఎడమవైపుది రామ్‌సేస్ - 2 ఆలయం. దీన్ని గ్రేట్ టెంపుల్ అని కూడా అంటారు. దీనికి కుడివైపున్న కొండలోది నెఫర్టరీ టెంపుల్ అని కూడా అంటారు. రామ్‌సేస్ -2 ఆలయం బయట, రెండు వైపులా కూర్చున్న భంగిమలో రామ్‌సేస్ -2, భార్య నెఫర్టరీ విగ్రహాలున్నాయి. ఈ రెండు జతల విగ్రహాల మధ్య లోపలకి ప్రవేశద్వారం ఉంది. ఒకో దానిఎత్తు 69 అడుగులు. రామ్‌సేస్ -2 కి గడ్డం, రెండు కిరీటాలున్నాయి. ఎడమవైపున్న నెఫర్టరీ విగ్రహం మోకాళ్ళదాకా ధ్వంసమైంది. లోపలకి వెళ్తే అటూ ఇటూ మనుషులు, దేవతల ఆకృతుల అవుట్‌లైన్స్ చెక్కిన నాలుగు స్థంభాలున్నాయి. వాటిలో ఓ ఆకృతి చేతులు ఛాతీకి కట్టుకున్న (మమ్మీ పొజిషన్) విగ్రహం. గర్భగుడిలో అరుగు మీద కూర్చున్న నాలుగు విగ్రహాలున్నాయి. అవి రామ్ సేస్ -2, ఈ పీటా, అముర్ రే, రేహోరాఖి అనే ముగ్గురు దేవతలవి. సంవత్సరంలో రెండుసార్లు సూర్యకిరణాలు గర్భగుడిలోని ఆ విగ్రహాల మీద పడతాయి. రామ్‌సేస్ 2 తను కూడా దేవతనే భావించేవాడు రామ్‌సేస్ -2 ఎక్సొడస్‌లో పేర్కొన్న మోసెసేనని కొందరి నమ్మకం. అతనికి దేవతలంటే అసూయ కూడా ఉండేదని అక్కడ ఓ స్థానిక గైడ్ చెప్పడం విన్నాను. లోపల అటూ, ఇటూ అనేక ఛాంబర్స్ ఉన్నాయి. కింద నించి గోడల దగ్గర కన్సీల్డ్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో దారిలో ఆలయ గోడలకి చెక్కిన చిత్రాలు, ఆనాటి మనుషులు, పెయింటింగ్స్, సింబల్స్, హైరోగ్లిఫిక్స్ కనిపించాయి. కూర్చున్న వ్యక్తి తలమీదకి ఎత్తిన గొడ్డలి, బాణం వేసే మనిషిలాంటి యుద్ధచిత్రాలు గోడలకి ఉన్నాయి. ఇన్నివేల ఏళ్ళు గడిచినా ఇంకా రంగు చెక్కుచెదరక పోవడం ఆశ్చర్యమే. పైన సీలింగ్ మీద కూడా అద్భుతమైన చెక్కడాలున్నాయి. అనేక చిన్న గదుల్లోంచి గోడల మీది చెక్కడాలని, శిల్పాలని, హైరోగ్లిఫిక్స్‌ని చూస్తూ, మలుపులు తిరుగుతూ బయటకి వచ్చాం.

తర్వాత కుడివైపున్న నెఫర్టరీ ఆలయం వైపు నడిచాం. సేండ్‌స్టోన్ కొండపాదం, శిఖరం మధ్యభాగంలో నించున్న ఆరు విగ్రహాలు కనిపించాయి. వాటి మధ్య ఫ్రేమ్స్ మీద సింబల్స్, హైరోగ్లిఫిక్స్ కూడా చెక్కారు. ఒక్కో విగ్రహం ఎత్తు 33 అడుగులు. రెండు రాజు, రాణి విగ్రహాలు. మిగిలినవి యువరాజు, యువరాణులవి. ఆ ఆరు విగ్రహాల మధ్య ఆలయంలోకి చిన్న ప్రవేశద్వారం ఉంది. అంటే ప్రవేశద్వారానికి అటూ, ఇటూ చెరో మూడు నించున్న విగ్రహాలు ఉన్నాయి. ద్వారం పైన కొండరాతిలో అవుట్‌లైన్‌గా చెక్కిన మనిషి బొమ్మ ఉంది. రెండు ఆలయాలకి ముందు సుమారు పదడుగులు వెడల్పున నేలమీద కాళ్ళు కాలకుండా బాటలా చిన్న అడ్డచెక్కలని పరిచారు. సందర్శకులు కూర్చోడానికి వీలుగా కొన్ని చెక్కబెంచీలున్నాయి.



రామ్‌సేస్ - 2 టెంపుల్

ఓ యూరోపియన్ పర్యాటకబృందానికి వారి గైడ్ ఇంగ్లీష్‌లో చెప్పేది విన్నాను.

"రాజు, అతని భార్య విగ్రహాల ఎత్తు సమానంగా ఉన్నాయని గమనించారా? ఇది రాజు రాణికి ఇచ్చే ప్రాముఖ్యతని సూచిస్తోంది. మిగిలిన చోట్ల రాణుల ఎత్తు ఫారో రాజు మోకాళ్ళ ఎత్తుని మించదు. ఓ రాణికి ఆలయాన్ని అంకితం ఇవ్వడం ఈజిప్షియన్ చరిత్రలో ఇది రెండోసారి. మొదటిసారి అఖెనటెన్ తన భార్య నెఫర్టిటీకి మొదటి ఆలయాన్ని నిర్మించాడు. ఈజిప్ట్‌ని పాలించిన ఫారోస్ మత, రాజకీయ


లోపల గోడలమీద వున్న చిత్రాలు

నేతలు. దేశంలో ఎలాగైనా శాంతి నెలకొల్పడానికి పాలించిన వారిలో కొందరు సమర్థులు. ఫారోస్‌లో దుర్మార్గులు కూడా ఉన్నారు. షిపా అనే ఫారో అప్పుడే పుట్టిన మగపిల్లల్ని చంపేసేవాడు."

స్మాల్ టెంపుల్ ప్రవేశద్వారంలోంచి లోపలకి వెళ్తే అటూ ఇటూ స్థంభాలకి వీపు ఆనించి నించున్న నాలుగు విగ్రహాలున్నాయి. గోడలకి చెక్కిన బొమ్మలు. రామ్‌సేస్ - 2 వీరత్వాన్ని ప్రదర్శించేవి, వృత్తి విద్యలకి సంబంధించినవి, ఫర్టిలిటీ గాడ్‌లాంటి దేవతలవి, పక్షులు, ద్రాక్షగుత్తులు, గుడ్లగూబలు లాంటివాటి ఆకృతులు హైరో గ్లిఫిక్స్‌లో చెక్కారు. కిందగోడకి అనుకున్న లైట్ల నించి పైకి కన్సీల్డ్ లైటింగ్ పడుతూండటంతో అవి స్పష్టంగా కనిపిస్తూ, నడిచే చోట కొద్దిగా చీకటిగా ఉంది. హైరో గ్లిఫిక్స్‌ని కుడినించి ఎడమకి, ఎడమ నించి కుడికి, పైనించి కిందకి కూడా చదవచ్చు. కొన్ని విగ్రహాల తలల మీద బంతులున్నాయి. ఇందులో చాలా చిన్న గదులున్నాయి.

రెండు ఆలయాలని చూసాక తిరిగి బస్ దగ్గరకి వచ్చేప్పుడు పద్మజ మార్కెట్లో ఒకోటి నలభై ఐదు ఈజిప్షియన్ పౌన్లిచ్చి లిపికి రెండు గౌన్లు, ఒకోటి 8 పౌన్లకి ఎనిమిది స్టోల్స్ కొన్నది. దారిలో రెస్టరెంట్స్, బయట కుర్చీలు, షాప్స్ చాలా కనిపించాయి. ఎక్కువగా బట్టల షాపులు. 'కమాన్. ఫార్టీ పౌండ్స్ ఓన్లీ' అని అరుస్తున్నారు. మళ్ళీ అంతా బస్సెక్కి ఉదయం పదికి వెనక్కి బయలుదేరాం. అంతా సమయానికే వచ్చారు. ఉదయం 11.10కి నా జీవితంలో మొదటిసారి ఎండమావిని చూసాను. కుడివైపు షుమారు నాలుగైదు కిలోమీటర్ల దూరంలో పెద్ద నీళ్ళ సరస్సు కనిపించింది. కానీ అక్కడ అదిలేదు. ఇలాంటి ఎండమావిల వెంటపడి ఎడారిలో తిరుగుతూ నీళ్ళు లేక మరణించినవారి కథలు మీరూ చదివేవుంటారు.



రాయల్ రూబీ ఓడలోనుండి ఒడ్డుకి వస్తున్న ప్రయాణికులు

మధ్యాహ్నం ఒంటిగంటన్నరకి బస్ నైలునది రేవుకి చేరుకుంది. దిగేప్పుడు ఇచ్చిన బోర్డింగ్ పాస్‌లని ఇచ్చి రాయల్ రూబీ ఓడ ఎక్కాం. మొహం తుడుచుకోడానికి ఎంట్రన్స్‌లో చల్లటి వెట్ నేప్కిన్‌ని ఇచ్చారు. మా కేబిన్‌లో ఏసి సరిగ్గా పని చేయడంలేదు. ఫిర్యాదు చేస్తే ఒకరొచ్చి చూసి ఎలక్ట్రీషియన్‌ని పంపిస్తానని చెప్పివెళ్ళాడు. అతనొచ్చి బాగుచేసాడు. స్నానం చేసాక లంచ్‌కి డైనింగ్ హాల్‌కి వెళ్ళాం. బుఫె లంచ్‌లో వెజ్ పలావ్, అన్నం, ఆనియన్ పలావ్, బీన్స్, బంగాళాదుంపలు కలిపిన కూర, నూడుల్స్ వేసిన టమోటా సూప్, కేరట్స్, కేబేజి తురుము సర్వ్ చేసారు. గ్రీన్ మెలన్ ముక్కలు, చిన్న జామకాయ. కాఫీ, టీ. పెరుగులేదు. నిన్న కదలకుండా ఉన్న మా ఓడ మధ్యాహ్నం నాలుగుకి నైల్ నది మీద బయలుదేరింది. మా తర్వాతి గమ్యం ఈజిప్ట్‌లోని మరో శిథిలాలయం కోమోంబో.

తర్వాతి స్టాప్‌కి గంట ప్రయాణం కాబట్టి ఓడ సన్‌డెక్ మీదే కూర్చున్నాం. ప్రయాణీకుల కోసం ఓ చోట స్నాక్స్‌గా మూడు రకాల బిస్కెట్స్, టీ ఉంచారు. ఓ చోట పచ్చిక బయళ్ళలో మేసే పెద్ద గేదెలు కనిపించాయి. తాటిచెట్లు కూడా చాలా కనిపించాయి. ఈజిప్ట్‌లో, ఇతర దేశాల్లో ఈ నైలు నది వల్లే మనిషి జీవించగలిగి, సంపద పొందాడు. ఎక్కడ సంపద ఉంటే అక్కడ సంస్కృతి కూడా అభివృద్ధి చెందుతుంది. నదులున్న చోటే నాగరికత, సంస్కృతులు అభివృద్ధి చెందుతాయి. దాదాపు గంట ప్రయాణించాక మా ఓడ ప్రయాణించే


కొమొంబో టెంపుల్

దిశకి ఎడమవైపు చూస్తే, ఒడ్డున ఎత్తైన సేండ్ స్టోన్ స్థంభాలు, వాటిమీది దిమ్మలు, అనేకమంది పర్యాటకులు కనిపించారు. అదే కోమోంబో. అంటే ది హిల్ ఆఫ్ గోల్డ్ (స్వర్ణపర్వతం) అని అర్థం. ప్రాచీన అరబిక్ భాషలో కోం అంటే పర్వతం అని, ఓంబో అంటే హైరో గ్లిఫిక్స్‌లో బంగారమని అర్థం. అస్వాన్‌కి ఉత్తర దిశగా నలభై ఐదు కిలోమీటర్ల దూరంలో, నైల్ నదికి తూర్పున ఇది ఉంది.

దీన్ని క్రీ.పూ 205లో ఆరంభించి 180లో పూర్తి చేసారు. చక్రవర్తి పోలమీ ది ఫిఫ్త్, ఆయన వారసులు, పోలమీల తర్వాత ఈజిప్ట్‌ని పాలించిన రోమన్స్ కూడా దీన్ని అభివృద్ధి చేయడంతో ఇది గ్రీకో రోమన్ స్టైల్ ఆర్కిటెక్చర్‌లో ఉంది. ప్రవేశంలోని స్థంభాన్ని రోమన్ చక్రవర్తి అగస్టస్ నిర్మించాడు. ఐదుం ముప్పావుకి ఓడ ఆగింది. దిగి పాస్ తీసుకుని బయటకి వచ్చాం. గైడ్‌ని అనుసరించి ఒడ్డు నించి పైకున్న మెట్లెక్కితే ఎదురుగా కోమోంబో శిధిలాలయం కనిపించింది. అది నదికి దాదాపు ఏభై అడుగుల ఎత్తులో ఉంది. కోమోంబో, క్రొకడైల్ పార్క్ టిక్కెట్స్ ఒకోటి 50 ఈజిప్షియన్ పౌన్లు వాటిని మాకిచ్చి మొహమ్మద్ చెప్పాడు.


కొమోంబో టెంపుల్ లోని ఒక భాగం

"మీకు గంటన్నర టైం ఇస్తున్నాను. మళ్ళీ సరిగ్గా ఏడున్నరకి ఓడ ఎక్కాలి."

ఈ ప్రాంతాన్ని ప్రాచీన ఈజిప్షియన్స్ ఓం బోస్ అని పిలిచేవారు. కోమోంబో అక్కడ ఉండటంతో దీనికా పేరు వచ్చింది. ప్రాచీన అరబిక్‌లో ఓంబో అర్థం బంగారం అని. ఆ కాలంలో ఇది ఈజిప్ట్‌లోని అతి ముఖ్యమైన ప్రాంతం. కారణం వ్యాపార సరుకుల బళ్ళు నుబియాకి నైలునదీ లోయలోంచే ప్రయాణించేవి. వారినించి సుంకాలు వసూలు చేసేవారు. అందువల్ల ఓంబోస్‌లో సైనికస్థావరం ఉండేది.

ప్రాచీన ఈజిప్ట్‌లోని మిగతా అన్ని దేవాలయాల్లానే సున్నపురాతితో, దీర్ఘచతురస్రాకారంలో ఈ సముదాయం నిర్మించబడింది. 1893లో దీని దక్షిణ వైపు కొంతభాగాన్ని డి.మోర్గాన్ అనే ఫ్రెంచ్ పరిశోధకుడు తవ్వి తీసాడు. ఇటుకలతో కట్టిన గోడలన్నీ మాయమై సేండ్ స్టోన్ స్థంభాల నిర్మాణం మాత్రం మిగిలి ఉంది. ఇక్కడ పక్కపక్కనే రెండు ఆలయాలున్నాయి. ఒకే రకంగా ఉన్న రెండూ రెండు ప్రవేశద్వారాలున్న విడి ఆలయాలు. ఒకటి నాశనమై ఒక ద్వారమే ప్రస్తుతం ఉంది. దక్షిణ దిశలో మొసలి తలగల సోబెక్ అనే దేవత ఆలయం ఉంది. 'హాథర్, కోమ్సు' అనే దేవతలతో కలుసున్న సోబెక్ దేవత ప్రపంచ సృష్టికర్త సంతానాన్ని ఇచ్చే దేవత. ఆ గుళ్ళోని ఓ స్థంబం మీద సోబెక్, దాని ముందు మోకాళ్ళ మీద కూర్చున్న రాజు ప్రసాదాన్ని సమర్పించే దృశ్యం చెక్కి ఉంది. ఇటీవలి కాలం దాకా నైలునదిలో పెద్ద మొసళ్ళు చాలా ఉండేవి. పూర్వీకులు వాటిని దేవతగా కొలవడం వల్ల అవి తమ మీద దాడి చేయవని ఆ దేవతని సృష్టించి ఉండచ్చని కొందరి భావన. ఈ ఆలయానికి 'హౌస్ ఆఫ్ ది క్రొకడైల్' అని కూడా పేరు.

ఉత్తరం వైపున్న రెండో ఆలయంలో ఈజిప్ట్‌ని, ఫారోలని రక్షించేగద్ద తల గల హరోస్ లేదా హరోరిస్' దేవత, టాసనే దేవతా విగ్రహాలున్నాయి. సీలింగ్ మీద ఎగిరే గద్దల దృశ్యాల మ్యూరల్స్(చిత్రాలు) ఉన్నాయి. ఈ గుళ్ళోని స్థంబం మీద కూడా హోరస్ విగ్రహం, దాని ముందు మోకాళ్ళ మీద కూర్చున్న రాజు ప్రసాదాన్ని సమర్పిస్తున్న దృశ్యం ఉంది. దీనికి కేజిల్ ఆఫ్ ది ఫాల్కన్ అని పేరు. ఈ ఆలయ సముదాయాన్ని పోలమీలు తమ సార్వభౌమాధికారాన్ని చాటడానికి కట్టారు. హోరస్ అంటే అధికారానికి చికిత్సకి అధిదేవత. హోరస్ వంపు

తిరిగిన విజయ ఖడ్గాన్ని పోలమిక్ రాజులకి బహూకరించే ఆకృతి కూడా ఓ చోట గోడ మీద చెక్కి ఉంది. ఈ రెండు ఆలయాల్లోని చిన్నగదులని స్టోర్ రూములుగా వాడేవారు.

లోపల వరండా, హైపోస్టైల్ (స్థంభాల మీద పై కప్పున్న హాల్) హాల్, మూడు ఇన్నర్ హాల్స్, అనేక చిన్న గదులు ఉన్నాయి. గోడలమీద, స్థంభాల మీద అందమైన చెక్కడాలు, శిల్పాలు, హైరో గ్లిఫిక్స్ ఉన్నాయి. పోలమీ ది ఎయిత్, పోలమీది ట్వల్త్ నైలు నదీ దేవత ముందు మోకాళ్ళ మీద కూర్చున్న విగ్రహాలున్నాయి. తర్వాతి తరాల పోలమీ రాజవంశీకులు ఈ ఆలయాలని అభివృద్ధి చేస్తూ వచ్చారు. రెండు ఆలయాల మధ్య మెట్లు, రెండు స్థంభాలు, రెండు ప్రవేశద్వారాలు, రెండు కోర్ట్‌యార్డ్‌లు, రెండు హైపోస్టైల్ హాల్స్, రెండు శాంక్చువరీలు ఈ ఆలయ ప్రాంగణంలో ఉన్నాయి. బయటివైపున్న ఆరు స్థంభాలు పై కప్పు పోయి బోసిగా ఉన్నాయి.

ప్రాచీన ఈజిప్ట్‌లో వైద్యం బాగా అభివృద్ధి చెందింది. చాలా జబ్బులకి వైద్యులకి చికిత్స తెలిసేది. దాంతో ఆలయం బయటి గోడ మీద ఆ నాటి వైద్య గ్రంథాలతో, సర్జికల్ పరికరాలతో నిలబడ్డ ఇంహటెప్ దేవత ఆకృతి కనిపిస్తుంది. ఆశ్చర్యంగా అవి నేటి సర్జికల్ పరికరాలని పోలి ఉన్నాయి. ఆ దేవత చికిత్సకి అధినేత. వైద్యం మీద మతప్రభావం తీవ్రంగా ఉండేది. ఇంహటెప్ పిరమిడ్ ఆర్కిటెక్ట్‌లలో ఒకరు. వైద్యంలో ఉపయోగించే పాత్రలు, స్టెరిలైజింగ్ మడుగులు, ప్రసవించే ఆడవాళ్ళు కూర్చోవాల్సిన పద్ధతి మొదలైనవి హైరోగ్లిఫిక్స్‌లో అక్కడ చెక్కారు. ప్రపంచంలోని ముఖ్యమైన ప్రాచీన నాగరికతల్లో ఒకటి ఈజిప్ట్ నాగరికత కదా మరి. ఇంహటెప్ ముందు చక్రవర్తి ట్రాజన్ మోకాళ్ళ మీద కూర్చుని ప్రసాదాన్ని సమర్పించే ఆకృతి కూడా ఓ గోడ మీద చెక్కి ఉంది.

ఫిలోమెడన్ అనే దేవతకి పోలమీ సిక్త్ ప్రసాదాలు సమర్పించే చిత్రం కూడా ఓ గోడ మీద ఉంది. పాపిరస్ ఆకారంలో ఓ స్థంభం ఉంది. మొత్తం పదహారు స్థంభాలు ఉన్నాయి. వాటిలో ఆరు కప్పుల్లేకుండా ఆరుబయట, మిగిలిన పది ఆలయ సముదాయంలో ఉన్నాయి. అబు సింబల్ ఆలయాల్లోలాగా ఇక్కడా ప్రతీ స్థంభం మీద దేవతల ఆకృతులు, హైరోగ్లిఫిక్స్ అంగుళం వదలకుండా చెక్కారు.

ప్రాచీన ఈజిప్షియన్స్ కాలాన్ని మూడు ఋతువులుగా విభజించారు. అవి వర్షం, నాట్లు, పంట కోయడం. ప్రతీ ఋతువుకీ నాలుగు నెలలు. ప్రతీ నెలకి మూడువారాలు. ప్రతీ వారానికి పది రోజులు. ముప్పై వారాలు కలిసి పన్నెండు నెలలకి 360 రోజులవుతుంది. సంవత్సరంలో మిస్సైన ఐదు రోజులని ఐదుగురు దేవతలు ఐసిస్, ఒసిరిస్, సెట్, నెఫ్తిస్ (సహాయం చేసే దేవత) హరోస్ పంచుకున్నారు. అంటే ఆ రోజుల్లోనే సంవత్సరాన్ని 365 రోజులతో కొలిచేవారు. వీరి ఈ కేలండర్ని గోడమీది హైరోగ్లిఫిక్స్‌లో చూడొచ్చు. ఓ రాతి మీద గద్ద తలగల సూర్యచంద్రులే కళ్ళుగా గల హెర్వర్ అనే దేవత, సింహం తల గల తోత్ అనే దేవత 'పోలమీ ది ట్వెల్త్ ' మీద మంత్రజలం పోసే ఆకృతి చెక్కి ఉంది. సోబెక్ ఆలయంలో కూడా సోబెక్ దేవత మంత్రజలం పోసే సరిగ్గా ఇలాంటి ఆకృతి ఉంది. కొన్ని చోట్ల పూర్తికాని, అనేక దశల్లోని చెక్కిన బొమ్మలు, ఆర్టిస్ట్‌ల స్కెచ్‌లు కనిపించాయి.

దీని ఆవరణలోనే ఓ షెడూఫ్‌తో (నీరు తోడే ఏతం) బావిలోంచి ఒకరు నీటిని తోడుతున్నారు. కొద్దిదూరంలోని క్రొకడైల్ మ్యూజియానికి వెళ్ళేదారిలో రెండు బావులున్నాయి. దీన్నించి ఓ చిన్న సరస్సులోకి నీరు ప్రవహిస్తోంది. ఆ చెరువులో మొసలి పిల్లలున్నాయి. మనుషులనేకాదు. ఈజిప్షియన్స్ జంతువుల కళేబరాలని కూడా మమ్మీలుగా రూపొందించేవారు. ఈ ప్రాంతంలో లభ్యమైన ముప్పై మొసలి మమ్మీలలోని కొన్నిటిని క్రొకడైల్ మ్యూజియంలో ప్రదర్శనలో ఉంచారు.

ఈ నైలునదీ పరివాహక ప్రాంతంలో చెరకుని పండిస్తున్నారు. సమీపంలోని దరా అనే ఊళ్ళో ప్రతీ మంగళవారం లేదా గురువారం ఒంటెల సంత జరుగుతుందట. ఇక్కడికి రైలు, రోడ్ మార్గాల్లో కూడా రావచ్చు.

ఈ ప్రాంతంలో సెప్టెంబర్ 2018లో సేండ్‌స్టోన్‌తో చేసిన పదిహేను అంగుళాల ఎత్తు, పదకొండు అంగుళాల వెడల్పు గల స్పింక్స్ విగ్రహం లభ్యమైందని ఈజిప్షియన్ ప్రభుత్వ ప్రకటనని తిరిగి వచ్చాక ఓ రోజు ఇంటర్నెట్లో చదివాను.

మళ్ళీ మెట్లు దిగి, రోడ్ దాటి ఏడుంపావుకి ఓడ రేవుకి చేరుకున్నాం. దిగేప్పుడు ఇచ్చిన బోర్డింగ్ పాస్‌లని ఇచ్చి మళ్ళీ ఓడ ఎక్కాం. చీకటి పడుతూండగా మా ఓడ మా తర్వాతి గమ్యమైన ఎడ్ఫూ వైపు కదిలింది. ఆ రాత్రి కూడా ఓడలోనే నిద్ర.

అత్యంత సౌందర్యవతి యొక్క భర్త, మూడు నెలల పాప



మా ఓడలోనే మొరాకో నించి వచ్చిన ఓ జంట ప్రయాణిస్తోంది. షుమారు పాతిక ముప్పై ఏళ్ళ వయసుగల ఆమె నేను అంతదాకా చూసిన అత్యంత సౌందర్యవతి. బురఖాలో లేదు. తలకి జుట్టు కనిపించకుండా స్కార్ఫ్‌ని కట్టుకుంది. భర్త, మూడు నెలల పాపతో ప్రయాణిస్తోంది. నేనామె భర్తని వారి కుటుంబాన్ని ఫోటో తీసుకోవచ్చా అనడిగాను. సరే అని - భార్యని దూరంగా పంపి తను, తన కూతురుతో నిలబడ్డాడు. వాళ్ళిద్దర్నీ తీసాను. రహస్యంగా ఆమెని మాత్రమే తీసుకునే అవకాశాలు చాలా వచ్చినా నేనాపని చేయలేదు. అది అతనికి ద్రోహం చేయడంగా భావించాను.

మీరు యూ ట్యూబ్‌లో ఈ ఆలయాల పేర్లు సెర్చ్ చేస్తే చక్కటి వీడియోలని చాలామంది పెట్టారు. ఇది చదివాక వాటిని చూస్తే మీకు చక్కటి అవగాహన వస్తుంది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*